మహిళలు విద్యావంతులైతేనే సమాజ అభివృద్ధి

- *తెలంగాణలో తొలిసారిగా ఫరూక్‌నగర్‌లో ఉర్దూ అభ్యసన కార్యక్రమం ప్రారంభం*
- *మార్చిలోగా 5,500 మందికి విద్య అందించడమే లక్ష్యం: వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి*




దశ, షాద్‌నగర్: మహిళా అక్షరాస్యతను పెంపొందించి, ప్రతి ఒక్కరికీ విద్యను చేరువ చేయడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూక్‌నగర్‌లో తెలంగాణలోనే తొలిసారిగా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు చదువుపై ఆసక్తి పెంచుకొని అక్షరాస్యత సాధించాలని పిలుపునిచ్చారు. వచ్చే మార్చి నెలలోగా ఫరూక్‌నగర్ మండలంలో 5,500 మంది పురుషులు, మహిళలకు విద్య అందించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ దిశగా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సెమినా మహిళా సేవా మండలి, ఆలియా సుల్తానా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు. పాల్గొని ఉర్దూ అభ్యసన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఫరూక్‌నగర్‌లో ఉర్దూ అభ్యసన కార్యక్రమం ప్రారంభం కావడం సంతోషకరమని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలియా సుల్తానా మాట్లాడుతూ తన సహకారంతో వెయ్యి మందికి ఉర్దూ భాష నేర్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉర్దూ భాషను ప్రతి ఇంటికీ చేరవేసి మహిళల్లో భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మహిళా విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, పిల్లల భవిష్యత్తు కోసం విద్యకు ప్రాధాన్యమిస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ న్యాయవాది సబియా సుల్తానా, మెప్మా సిబ్బంది ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- *పోటీ పరీక్షల అభ్యర్థులకు దిశానిర్దేశం.. పాఠకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సూచన*



దశ, రంగారెడ్డి: బడంగ్‌పేట్‌లోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయంలో పాఠకులకు అందుతున్న సేవలు, పుస్తకాల లభ్యత, మౌలిక సదుపాయాలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఆమె మాట్లాడి, వారి సన్నద్ధతను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో విజయం సాధించాలంటే నిర్దిష్ట లక్ష్యంతో చదవడం, సమయపాలన పాటించడం, క్రమశిక్షణతో సాధన చేయడం, ప్రస్తుత అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం ముఖ్యమని సూచించారు. పునశ్చరణకు తగిన సమయం కేటాయిస్తూ అందుబాటులో ఉన్న పుస్తకాలు, అధ్యయన సామగ్రిని సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడే విజ్ఞాన కేంద్రాలని పేర్కొన్నారు. పాఠకులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.జి.వి. రాణి, గ్రంథాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి: నర్సంపేట బీజేపీ కార్యవర్గ సమావేశం

- *పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి: జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి*

దశ, నర్సంపేట: భారతీయ జనతా పార్టీ సంయుక్త కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఇన్‌చార్జీలుగా దేవేందర్ రెడ్డి, రంజిత్ హాజరై సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, బూత్ స్థాయి నుంచి పార్టీ గెలుపునకు సమష్టిగా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోకన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు గూడూరు సందీప్, తనుగులు అంబేద్కర్, నాయకులు జూలూరు మనీష్ గౌడ్, జుర్రు రాజు, మహేందర్ రెడ్డి, శీలం సత్యనారాయణ, వీరన్న, జగన్, పృథ్వీరాజ్, దయాకర్, రమేష్ తదితర మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి: చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

- *ఎల్‌నినో ప్రభావంపై వార్డు సభలు.. నీటి పొదుపుపై అవగాహన*



దశ, చౌటుప్పల్: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పలు వార్డుల్లో అవగాహన సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో ప్రజలకు నీటి పొదుపు, పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.లక్కారం 8వవార్డులోనికార్యాలయం వద్ద కౌన్సిలర్ బద్రి గాలయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. అనంతరం తంగడపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో 4, 5, 6, 15వ వార్డులకు సంయుక్తంగా అవగాహన సమావేశం నిర్వహించారు. చౌటుప్పల్ కచ్చీరు వద్ద 9, 10, 11, 19వ వార్డుల ప్రజలతో సమావేశం జరగగా, కంచరకుంట్ల కాలనీలోని వినాయక మండపం వద్ద 12, 13వ వార్డుల ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఇంట్లో నీటి కుళాయిలు, పైపుల లీకేజీలను వెంటనే సరిచేయడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చని తెలిపారు. పట్టణ పరిశుభ్రతను కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.

కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాలి, నీరు, భూమిని పరిరక్షించి భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని సూచించారు. లక్కారం వార్డు సభలో ప్రజలు అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, కొయ్యాల శేఖర్, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, దేప రమ్య రాజు, పిల్లలమర్రి మధుసూదన్, ఒకపాక చిరంజీవి, బత్తుల వాణి విప్లవ్‌తో పాటు మున్సిపల్ అధికారులు, మెప్మా ఆర్పీలు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు, యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కోతుల దాడి ..భయంతో 12 ఏళ్ల బాలుడు మృతి



దశ, సూర్యాపేట: నడిగూడెం మండలం వల్లాపురంలో విషాద ఘటన జరిగింది. అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా బాలుడిపై కోతుల గుంపు దాడి చేసింది. కోతుల దాడితో భయపడి బాలుడు పరుగులు తీసాడు. భయంతో పరుగెత్తిన బాలుడు కిందపడి మృతి చెందాడు. మృతుడు వల్లాపురానికి చెందిన మొక్క వీరబాబు కుమారుడు నిశాంక్ గౌడ్ (12) గా గుర్తించారు. కోతుల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డితో పెద్ది స్వప్న భేటీ



దశ, నర్సంపేట: వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. szఅనంతరం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయిలో పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరువురు చర్చించారు. నర్సంపేట నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించడం, ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించడం, గ్రాడ్యుయేట్లను ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేయడంపై సమాలోచనలు జరిపారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా సమన్వయంతో కృషిచేయాలని నిర్ణయించారు.

ఐక్య పోరాటాలతోనే ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారం: మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



- *ఆశాల న్యాయమైన పోరాటానికి BRS సంపూర్ణ మద్దతు*
- *మేనిఫెస్టోలో ఇచ్చిన రూ. 18 వేల వేతన హామీని వెంటనే అమలు చేయాలి*

దశ, వరంగల్: ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఆందోళనలకు భారత్ రాష్ట్ర సమితి (BRS) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ స్పష్టం చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన పిలుపునిచ్చారు.

వరంగల్ నగరంలోని దేశాయిపేట, చింతల్ ప్రాంతాలకు చెందిన పలువురు ఆశా కార్యకర్తలు BRS కార్మిక విభాగమైన BRTU అనుబంధ సంఘంలో చేరారు. BRTU జిల్లా అధ్యక్షులు గోనె యువరాజు, ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి గోలి సంధ్య, జిల్లా నాయకురాళ్ళు పిట్టల శ్రీలత, సుజాతల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆశా కార్యకర్తలకు నెలకు రూ. 18,000 వేతనం అమలు చేసేంత వరకు వారి వెన్నంటి ఉండి పోరాడతామని భరోసా ఇచ్చారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తలు కీలక భూమిక పోషిస్తున్నారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వీరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను కాలరాయకుండా వెంటనే ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్ళు సృజన, మాధవి, శోభ, సుమలత, ప్రమీద, మాలతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

దశ, వరంగల్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం 12 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. ఎన్హెచ్ఎం ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు బీఆర్టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఉద్యోగుల ధర్నాలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం యువరాజు మాట్లాడుతూరాష్ట్రవ్యాప్తంగా 17 విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, అప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. మూడేళ్లు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగులను నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం

- *పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.. అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు.*



దశ, రంగారెడ్డి: రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించి, ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద అర్హులైన బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు గరిష్ఠంగా రూ.1.5 లక్షల విలువైన నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం రాహత్ పథకం అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే రోడ్డు ప్రమాద కేసులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, బాధితుల వివరాల ధ్రువీకరణలో పోలీసులు వేగంగా స్పందించాలని సూచించారు. చికిత్స ఖర్చులకు సంబంధించిన క్లెయిమ్‌లను పరిశీలించి, ఆసుపత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. నెక్స్ట్‌జెన్ ఎంపరివాహన్ మొబైల్ యాప్ ద్వారా ప్రమాదాల వివరాల నమోదు, క్లెయిమ్‌ల స్థితిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు చికిత్సలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, రహదారి భద్రతా లోపాలను సరిచేయాలని ఆదేశించారు. రవాణా, పోలీసు, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బీ, ఎన్‌హెచ్ఏఐ శాఖలు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అంబులెన్స్‌లు, ఆసుపత్రులు, ట్రామా సెంటర్ల సేవలను సమీక్షించి, సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అవసరమైన ప్రక్రియలను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని, మండలాల వారీగా నమోదైన కేసులు, ఆమోదించిన క్లెయిమ్‌లు, పెండింగ్ కేసులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ అండ్ బీ, రవాణా శాఖల అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన ఒంటరితనం

- *30 ఏళ్లు పైబడ్డా ఒంటరితనానికే మొగ్గు*
- *అటు అబ్బాయిలు, ఇటు అమ్మాయిలు అదే బాట*
- *సోషల్ మీడియా ప్రభావమే దీనికి కారణం*
- *దేశంలో జనాభా తగ్గుదలకు ఇదే కారణం*
- *బాధ్యతలు, కుటుంబ కలహాలే ప్రధాన కారణం*
- *పెళ్లి అంటేనే ఆంక్షలు అనే ధోరణిలో అమ్మాయిలు*
- *పెళ్లి చేసుకుంటే ఏం చేస్తారో అని అబ్బాయిలు*
- *సింగిల్ కె మొగ్గు చూపిస్తున్నట్టు అనేక సర్వేలు వెల్లడి*



దశ, తాండూర్ ప్రతినిధి: మనిషి సంఘజీవి. కానీ నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో అందరి మధ్య ఉన్నప్పటికీ, ఎవరికివారే అన్నట్లుగా జీవిస్తున్న పరిస్థితులను అనేకమంది ఎదుర్కొంటున్నారు. ఈ భావోద్వేగ ఒంటరితనం కేవలం మనసును మాత్రమే కాదు, శరీరానికి హాని కలిగిస్తుందని ఒక అధ్యయనం హెచ్చరిస్తోంది. ఫిన్లాండ్కు చెందిన పరిశోధకులు యూకేకు చెందిన సుమారు 2,77,000 వయోజనుల డేటాను విశ్లేషించి ఈ నిజాలను నెలడించారు.

ఒంటరితనం, సామాజిక ఒంటరితనం మనుషులను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో పరిశోధకులు అధ్యయనం చేశారు. సుమారు 2,77,000 మందికి పైగా వయోజనుల డేటాను విశ్లేషించి నిర్వహించిన ఈ భారీ పరిశోధనలో పలు ఆసక్తికరమైన, ఆందోళనకరమైన విషయాలు సైతం వెలుగు చూశాయి. తీవ్రమైన ఒంటరితనం, సామాజిక ఒంటరితనం అనుభవించే వ్యక్తులు.. వాటికి దూరంగా ఉన్నవారితో పోలిస్తే ఆరోగ్యకరమైన, దీర్ఘకాలిక వ్యాధి రహిత జీవితాన్ని కోల్పోతున్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. శారీరక రుగ్మతల కంటే ముఖ్యంగా డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలపై ఈ ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందని పరిశోధకులు స్పష్టం చేశారు.

ఆరోగ్యకరమైన అలవాట్లే రక్షణ

అధ్యయనం ప్రకారం.. 50 ఏళ్ల వయసులో లోన్లీనెస్, సోషల్ ఐసోలేషన్ను ఎదుర్కొంటున్న మహిళలు దాదాపు 3 సంవత్సరాల వరకు తమ ఆరోగ్యకరమైన జీవితాన్ని కోల్పోతుండగా.. పురుషులు దాదాపు 2.2 సంవత్సరాలు కోల్పోతున్నట్లు అంచనా వేశారు. అయితే ఈ ప్రమాదం నుంచి కొంత వరకు రక్షణ పొందడానికి ఆరోగ్య కరమైన జీవనశైలి ఎంతో దోహదపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. శారీరక శ్రమ (వ్యాయామం), పౌష్టికాహారం, తగినంత నిద్ర, ధూమపానానికి దూరంగా ఉండటం వంటి ఆరోగ్యకర మైన అలవాట్లు ఎక్కువ కాలం వ్యాధి రహిత జీవితాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారమే సరిపోదు

కేవలం ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామాలతోనే ఒంటరితనాన్ని పూర్తిగా జయించలేమని కూడా అధ్యయనం గుర్తుచేస్తోంది. మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు అర్థవంతమైన సంబంధాలు, ఆప్యాయతను పంచే సమాజం, ఆపదలో అండగా నిలిచే సోషల్ సపోర్ట్ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నది. కుటుంబంతో, సమాజంతో కనెక్ట్ అప్పడంతో ఒంటరితనం నుంచి బయట పడవచ్చునని చెప్పింది.

అబ్బాయి, అమ్మాయి ఓ 30 ఏళ్లు

అమ్మాయిలు పెళ్లిళ్లు అంటేనే భయపడుతున్నారు. 30 ఏళ్లు దాటిన అమ్మాయిలు పెళ్లి చేసుకోవడం లేదు.పెళ్లి, సంసారం ,కాపురం ,కుటుంబం ,బాధ్యతలు కుటుంబ కలహాలు ఇవన్నీ చూస్తూ ఉంటే పెళ్లికి అమ్మాయిలు చాలామంది దూరంగానే ఉంటున్నారని సర్వేలు తెలుపుతున్నాయి.

ఇదేవిధంగా అబ్బాయిలు కూడా 30 ఏళ్ల పైబడిన వాళ్లు అనేకమంది ఈ దేశంలో ఉన్నారు. వీళ్లు కూడా పెళ్లి అంటేనే భయపడుతున్నారు. ఒంటరితనానికి మొగ్గు చూపిస్తున్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత వచ్చే అమ్మాయి ఎలా ఉంటుందో అని భయపడుతున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో అమ్మాయిలు ఎంత నీచానికి దిగజారిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వాటిని చూస్తేనే తలుచుకుంటేనే భయపడిపోతున్నారు. దీనితో అబ్బాయిలు కూడా పెళ్లికి దూరంగా ఉంటున్నారు.

అంజనాపురంలో పట్టపగలే భారీ చోరీ



దశ, బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురంలో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా తీసుకున్న దుండగులు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించినట్లు సమాచారం. పగటిపూటే ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చోరీలో సుమారు రూ.2.50 లక్షల నగదుతో పాటు అర కిలో వెండి, సుమారు 15 తులాల బంగారం అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. ఇంట్లో భద్రంగా ఉంచుకున్న నగదు, విలువైన ఆభరణాలు చోరీకి గురికావడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము, భద్రపరుచుకున్న ఆభరణాలు కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటనపై బాధితులు బూర్గంపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్సైచ్ఓ మేడా ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన తీరుపై వివరాలు సేకరిస్తూ, ఘటనకు సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తున్నారు. దొంగలు ఇంట్లోకి ఎలా ప్రవేశించారు, చోరీకి పాల్పడిన వారు ఎవరనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అంజనాపురంలో పట్టపగలే చోరీ జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు గ్రామంలో నిఘా పెంచి, చోరీకి పాల్పడిన వారిని త్వరితగతిన గుర్తించాలని కోరుతున్నారు.అపహరణకు గురైన నగదు, బంగారం, వెండిని స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విధులకు డుమ్మా.. 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలు రద్దు!

- *షోకాజ్ నోటీసులకు స్పందించకపోవడంతో చర్యలు.. రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి*



దశ, రంగారెడ్డి: విధులకు హాజరుకాకుండా, షోకాజ్ నోటీసులకు స్పందించని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను తక్షణమే రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి వెల్లడించారు. జిల్లాలో మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు గైర్హాజరు కావడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో 48 మంది నోటీసులకు స్పందించి తిరిగి విధుల్లో చేరగా, మిగిలిన 54 మంది స్పందించకపోవడంతో వారి సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ రీ సర్వే పనుల్లో పాల్గొని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

రద్దు చేసిన సర్వేయర్ల స్థానంలో కొత్త లైసెన్స్ సర్వేయర్లను నియమించి, రీ సర్వే పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలిన సర్వేయర్లు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

వీబీజీ రాంజీ నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మహాలక్ష్మి



దశ, మునగాల: గ్రామపంచాయతీ పాలకవర్గాలు వీబీజీ రాంజీ నిధుల్ని సద్వినియోగం చేసుకుంటూ, గ్రామీణ పల్లెల్లో పారదర్శకంగా పనులు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ డిప్యూటీసిఈఓ మహాలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న వీబీరాంజీ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్ల వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని, కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. పనులకు హాజరవుతున్న కూలీలకు రోజుకు రూ.308 కూలి లభించే విధంగా అవగాహన కల్పించారు.అనంతరం గ్రామంలో చేపట్టిన జలసిరి పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలో అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దిత సమయంలో పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ ఎంపీడీవో నరేష్, టీఏ శ్రీధర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వీరయ్య, మేట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన అవసరం: .ఎస్సై సంజీవరెడ్డి



దశ, మునగాల: పాఠశాల దశలోనే పోలీసు వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన అవసరమని మునగాల ఎస్సై మల్లు సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా, పాఠశాల విద్యార్థులకు పోలీసు ఓపెన్ హౌస్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ వ్యవస్థ పై అన్ని విషయాలను తెలియజేస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణ, సెల్ ఫోన్ వాడకం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు వంటి పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. అంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వాడకం పట్ల అప్రమత్తంగా ఉండేలా పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాల గురించి వివరించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, మరియుసోషల్ మీడియాను వినియోగించే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయనతెలిపారు. విద్యార్థులు చట్టాలపైఅవగాహన పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో వ్యవహరిస్తూ సమాజంలో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని ఎస్సై సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీసుల విధులు, ప్రజల భద్రత కోసం పోలీసులు చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశం అని ఆయన తెలిపారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

దశ, కామారెడ్డి: వృద్ధురాలి ఇంట్లో జరిగిన చోరీ కేసును బిచ్కుంద పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.12 వేల నగదుతో పాటు చోరీకి ఉపయోగించిన ఇనుప రాడ్ను స్వాధీనం చేసుకున్నారు.కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఐపీఎస్ అభినందించారు. బిచ్కుందకు చెందిన సుంకరి సాయవ్వ ఈ నెల 14న బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వెళ్లడంతో ఆమె ఇల్లు ఖాళీగా ఉంది. ఈ నెల 18న అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో నిందితులు ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి పెట్టెలో దాచిన రూ.15 వేల నగదును దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్సైచ్ఓ రాజు ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పరిశీలన, స్థానిక సమాచారం ఆధారంగా గాలింపు చేపట్టారు. అక్టోబర్ 23న రాజుళ్ల చౌరస్తాలోని పరమేశ్వర థియేటర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. నిందితులు బాన్సువాడకు చెందిన దాసరి తిరుపతి, బిచ్కుందకు చెందిన చౌహాన్ అర్జున్ (29), చౌహాన్ సురేష్ (34)గా పోలీసులు గుర్తించారు. తిరుపతిపై బాన్సువాడ పోలీస్టేషన్ పరిధిలో గతంలో 10 దొంగతనం కేసులు, అర్జున్పై బిచ్కుంద పోలీస్టేషన్ పరిధిలో ఐదు కేసులు ఉన్నట్లు తెలిపారు. మద్యానికి అలవాటుపడి డబ్బుల కోసం చోరీకి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తులో మిగిలిన రూ.12 వేల నగదుతో పాటు నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్ను స్వాధీనం చేసుకున్నారు.


చెత్త వేరు చేసే యంత్రం ఏర్పాటు

- *జనగామ డంపింగ్ యార్డులో భూమిపూజ*
- *చేసిన మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి-శ్రీనివాస్*

దశ, జనగామ: జనగామ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా డ్రై అండ్ వెట్ వేస్ట్ సెగ్రిగేషన్ మెషీన్ ఏర్పాటు పనులకు మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణిశ్రీనివాస్ భూమిపూజ నిర్వహించారు. పట్టణంలో రోజువారీగా సేకరించే చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడంతో పాటు, తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా విభజించేందుకు ఈ యంత్రం ఉపయోగపడనుంది.చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం ఈ యంత్రం ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చెత్తను వేరు చేయడం ద్వారా పునర్వినియోగానికి అనువైన వ్యర్థాలను గుర్తించి, వాటిని తగిన విధంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. తడి చెత్త నిర్వహణను మెరుగుపరచడంతో పాటు, పొడి చెత్తను వేరు చేసి పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు చేపట్టేందుకు ఈ యంత్రం దోహదపడనుంది.పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో లోధి సమాజ్ పాత్ర కీలకమైనది: కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ

- *హైదరాబాద్లో వైభవంగా ముగిసిన అఖిల భారతీయ లోధి మహాసభ*



దశ, హైదరాబాద్ : దేశ నిర్మాణంలో లోధి సమాజ్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ (బన్వారీ లాల్ వర్మ) అన్నారు. శనివారం హైదరాబాద్ లోని ధూల్పేట్లోని 'రాణి అవంతీబాయి భవన్'లో అఖిల భారతీయ లోధిలోధాలోధి మహాసభ తెలంగాణ రాష్ట్ర విభాగం నిర్వహించింది. రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మతో పాటు జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విపిన్ కుమార్ వర్మ (డేవిడ్), మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ పటేల్, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి జాలిమ్ సింగ్ పటేల్, మాజీ మంత్రి డాక్టర్ రవీందర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ మాట్లాడుతూ... లోధి సమాజ సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో సమాజ ప్రజలు మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం లోధి వర్గాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, సమాజమంతా సంఘటితంగా పోరాడితేనే సమాజానికి దక్కాల్సిన అభివృద్ధి నిధులు సాధించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ సింగ్ మాట్లాడుతూ...దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లోధి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలు ఈ మహాసభకు విచ్చేయడం ఎంతో గర్వకారణమన్నారు. తమ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే స్వయం సమీక్ష చేసుకుంటూ, లోపాలను సవరించుకొని ముందుకు సాగాలని సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ హోదాల్లో లోధి సమాజ సభ్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, స్వల్ప వ్యవధిలోనే ఈ మహాసభను అత్యంత దిగ్విజయంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ మహాసభలో జనరల్ సెక్రటరీ శైలేందర్ సింగ్, ఠాకూర్ జితేందర్ సింగ్, యూత్ ప్రెసిడెంట్ దీపక్ సింగ్, మహిళా అధ్యక్షురాలు లీనా సింగ్, జనరల్ సెక్రెటరీ నిషా సింగ్, కోశాధికారి అంజురాణి, ఉపాధ్యక్షురాలు పూజా సింగ్, దినేష్ సింగ్, పప్పు మాత్రే, ప్రశాంత్ సింగ్, రోహన్ సింగ్, ఉపేందర్ సింగ్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో లోధి సామాజిక వర్గానికి చెందిన మహిళలు,యువకులు పాల్గొన్నారు.